క్లుప్తంగా

అయోధ్య రాముని అక్షింతలు ఊరేగింపు



వాహనాలపై అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

మందస: ఉద్దాన ప్రాంతమైన రాంపురం, పెద్ద బిడిమిలో అయోధ్య రాముని అక్షింతలను బుధవారం ఊరేగించారు. ద్విచక్ర వాహనాలపై గ్రామాల్లోని వీధి, వీధిన ఊరేగించి, హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతీ ఇంటికీ అక్షింతలను అందజేశారు.

బాధ్యతలు చేపట్టిన రూరల్ సీఐ



విధులకు హాజరైన ఈశ్వరరావు

కాశీబుగ్గ: కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన పి.ఈశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన జి.శంకరరావు అనకాపల్లి పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లగా.. విశాఖ జిల్లా పరవాడ పోలీసుస్టేషన్‌లో పని చేసిన ఈశ్వరరావు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

టెక్కలి రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళి అన్నారు. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు సిబ్బందితో కలిసి బుధవారం కాలినడక వెళ్లి ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా షాపు యజమానులతో మాట్లాడుతూ.. ఇతరులకు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్‌పై దృష్టిసారించాలని సూచించారు. అతివేగంగా వెళ్తున్న వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు.

జానపద గాయకుడుకి సత్కారం



సత్కారం పొందుతున్న తులసయ్య, రామకృష్ణ

పలాస/కాశీబుగ్గ: మామిడిపల్లి గ్రామంలో జరిగిన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఉద్దాన జానపద గాయకుడు గేదెల తులసయ్య, సినీనటుడు అమ్మ రామకృష్ణలను స్థానికులు సత్కరించారు. బొడ్డపాడు పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి మామిడిపల్లి గ్రామ పెద్దలు అందరూ కలిసి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జానపదాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కళ్లద్దాలు పంపిణీ



కంటిఅద్దాలు పంపిణీ చేస్తున్న సురేష్‌బాబు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి తాళభద్ర సచివాలయంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు ఉచితంగా కంటిఅద్దాలను బుధవారం పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న 20 మందికి వీటిని అందజేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మేఘన, గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.సుశీల, మెడికల్ ఆఫీసర్ ఎ.సాయికిరణ్, డాక్టర్ శ్యాంకుమార్, సచివాలయం అడ్మిన్ ఎస్.జనార్దన్, వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, వార్డు హెల్త్ సెక్రటరీ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించండి

నందిగాం: గ్రామాల అభివృద్ధిపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో రాజారావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయం, ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన నిధులు, రాబోయే ఏడాది ప్రణాళికలు తయారు చేసుకొని అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు.

22న ఒడియా కళాకారుల సమ్మేళన్

మందస: బుడారిసింగిలో ఈ నెల 22న ఒడియా కళాకారుల సమ్మేళన్ నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ఇన్‌చార్జి డాక్టర్ నల్ల తిరుపతి సాహు, డాక్టర్ కుమార్‌నాయక్, బుడారిసింగి సర్పంచ్ సురేష్‌కుమార్‌పాణిగ్రాహి చెప్పారు. అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రతిష్ఠను పురస్కరించుకుని, శ్రీరామాలయంలో ఒడియా కళాకారులతో రామ తారకమహామంత్రం, యజ్ఞం, హోమం, ఆధ్యాత్మిక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఉత్తమ ప్రదర్శనలిచ్చిన కళాకారులకు సన్మానాలు, సత్కారాలు చేస్తామన్నారు. ఆంధ్రాలో నివాసం ఉంటున్న ఒడియా కళాకారులకు గుర్తింపు కార్డులు కూడా పంపిణీ చేస్తామన్నారు. వివరాలకు 8790578177, 6371114628 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సచివాలయాలు ఆధునిక దేవాలయాలు

- ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



పాత్రకొండలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న రామారావు, సాయిరాజ్, నిమ్మన దాస్

సోంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయాలు ఆధునిక దేవాలయాలుగా ఉన్నాయని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. కర్తలిపాలెం, పాత్ర కొండ పంచాయతీల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాల భవనాలు, పలు అభివృద్ధి పనులను ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. కర్తలిపాలెంలో రూ. 40 లక్షలతో నిర్మాణం చేపట్టిన సచివాలయ భవనం, పాత్ర కొండ సచివాలయం పరిధిలో నిర్మించిన సచివాలయ భవనం, రూ. 3.5 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మాణం చేపట్టిన బస్సు షెల్టర్, రూ. 2.5 లక్షలు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో జగ్గునాయుడు చెరువు గట్టు వద్ద నిర్మాణం చేపట్టిన స్నానాల వాటికను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామారావు, సాయిరాజ్ మాట్లాడుతూ.. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజా సమస్యలను గ్రామస్థాయిలోనే పరిష్కరించడంతోపాటు మెరుగైన సేవలను గత నాలుగున్నరేళ్లలో అందించి ప్రభుత్వ పాలనలో సాధించిన అతి పెద్ద విజయం అన్నారు. గత ప్రభుత్వాలకు, ఈ ప్రభుత్వాకి గల తేడాను ప్రజలు గమనించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు, మాజీ ఎంపీపీ మంగి గణపతి, ఎంఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, మండల పార్టీ అధ్యక్షుడు సిలగాన భాస్కరరావు, కర్తలిపాలెం, పాత్రకొండ సర్పంచ్‌లు పొందూరు గున్నయ్య, బి.ఖగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు అఖేటి నాగేశ్వరరావు ఉన్నారు.

ఎన్నికల విధులకు సమాయత్తం కావాలి

- పలాస ఆర్డీవో భరత్ నాయక్



మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్‌నాయక్

ఇచ్ఛాపురం రూరల్: రాబోయే సార్వత్రిక ఎన్నికల విధులకు అధికారులు, ఉద్యోగులు సమాయత్తం కావాలని పలాస ఆర్డీవో డాక్టర్ భరత్ నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపాలిటీ, విద్యాశాఖ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని 299 పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం, దివ్యాంగులకు అవసరమైన ర్యాంప్‌లు సిద్ధం చేయాలన్నారు. అలాగే పక్కాగా విద్యుత్ సౌకర్యం ఉండాలన్నారు. అక్కడక్కడ వసతులు లేకపోయినా, మరమ్మతులకు గురైనా సంబంధిత శాఖ ద్వారా నిధులు సేకరించి జనవరి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈనెల 24 నుంచి ఇచ్ఛాపురం రాజావారి మైదానంలో ప్రారంభమయ్యే నియోజకవర్గస్థాయిలో ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలను ఈ నెల 31వ తేదీ నాటికి ముగించేందుకు విద్యాశాఖ, మండల పరిషత్, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడాకారులకు భోజన, వసతి, వైద్య సదుపాయాలతో పాటు పోలీసుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు ఎం.ఈశ్వరరావు, బి.వెంకటరమణ, సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, హైమావతి, రామచంద్రరావు, సత్యన్నారాయణ, మున్సిపల్ కమిషనర్ రమేష్, ఉప తహసీల్దార్ శ్రీహరి, విద్యాశాఖ అధికారి కురమాన అప్పారావు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత సుఖీభవ జట్టు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న రత్నం బాలరాజు

వజ్రపుకొత్తూరు: అమలపాడు గ్రామంలో సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన కబడ్డీ పోటీల్లో సుఖీభవ జట్టు విజయం సాధించింది. విజేతలకు స్థానిక సర్పంచ్ దున్న రత్నం బాలరాజు బహుమతులు ప్రదానం చేశారు. తొమ్మిది ఆహ్వానిత జట్లు తలపడ్డాయి. పోటీల్లో విశేష ప్రతిభ, క్రీడా స్ఫూర్తిని కనబరిచి బెస్ట్ రైడర్‌గా మురళీ నిలిచారు. యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఖోఖో మండల విజేతగా హరిదాసుపురం



విజేతగా నిలిచిన హరిదాసుపురం జట్టు సభ్యులు

నందిగాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం-ఆంధ్రా పోటీల్లో ఖోఖో విభాగంలో మండల విజేతగా హరిదాసుపురం జట్టు నిలిచింది. మండల స్థాయిలో జరిగిన ఈ పోటీలో విజేతగా నిలిచిన జట్టును స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు కణితి నారాయణ మూర్తి అభినందించారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న పేరాడ తిలక్

వజ్రపుకొత్తూరు: గ్రామీణ క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. పూండిలో జరుగుతున్న ఆడుదాం-అంధ్రా క్రీడల్లో భాగంగా క్రికెట్‌లో సెమీ ఫైనల్ పోరును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి వారిని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నంగా ఆలోచించి ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్‌ఎం కె.హరిబాబు, పీఈటీ నాగరాజు, ఎన్‌ఆర్‌ఐ గుంట విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొరకల రామారావు, వాసు, సింహాచలం ఉన్నారు.

కొత్తపల్లిలో ముగిసిన సంక్రాంతి సంబరాలు



బహుమతులు అందుకున్న విజేతలు

మందస: కొత్తపలిలో మూడు రోజులుగా జరుగుతున్న సంక్రాంతి సంబరాలు బుధవారంతో ముగిశాయి. సర్పంచ్ సేనాపతి దివ్య, పెద్దలు, యువత ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, ముగ్గులు పోటీలు నిర్వహించారు. వాణిజ్యపన్నులశాఖ డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ బడియా కామరాజు, ఎంఈవో-2 మద్రిపాటి భాస్కరరావు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు సేనాపతి మురళీ, గవ్వ భీమారావు, సేనాపతి ఈశ్వరరావు, అశోక్‌పాణిగ్రాహి, అన్నెపు సుధాకర్, కార్తికేశ్వరచౌదరి, దివాకర్ పాణిగ్రాహి, సేనాపతి యుగంధర్, ఉపాధ్యాయులు జి.రమేష్, బి.పాపారావు, ప్రభాకర్‌పాణిగ్రాహి, డి.మోహనరావు ఉన్నారు.

ఔదార్యాన్ని చాటాలి



వస్త్రాలను అందజేస్తున్న దాతలు

టెక్కలి: సామాజిక సంఘాలన్నీ ఒక వైపు సమాజ చైతన్యానికి పాటు పడుతూ మరో వైపు తమ సంఘంలో ఉన్న నిరుపేదలను ఆదుకునేందుకు ఔదార్యాన్ని చాటాలని పట్టణానికి చెందిన పట్టుశాలి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు దుంపా లోకేశం అన్నారు. బుధవారం పట్టుశాలి సంక్షేమ సంఘం ఆరాధ్య దైవం భావనా మహర్షి జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భావనా మహర్షి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంఘం సభ్యుడు పమ్మిన సింహాచలం దంపతుల సౌజన్యంతో నిరుపేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎం.మధుసూదనరావు, కార్యదర్శి డి.శ్రీనివాస్, సభ్యులు డి.సాంబశివరావు, బి.శ్యామ్‌సుందర్రావు, డి.రామకృష్ణ, ఎ.వెంకటేశ్వరరావు, బి.నందికేష్, డి.మోహన్‌రావు, డి.సుధా, కె.అచ్యుత్ రావు, కె.రఘునాథరావు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కంచిలి: కొల్లూరు పెద్దవీధికి చెందిన బచ్చు దాలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పైల లక్ష్మీనారాయణ, కాయ నూకయ్య ఉన్నారు.

పేదలకు చారిటబుల్ ట్రస్టు వితరణ



వస్త్రదానం చేస్తున్న దృశ్యం

మందస: బిన్నళమదనాపురం పంచాయతీ వెంకటవరదరాజపురం గ్రామానికి చెందిన కొర్ల కన్నారావు, కవిత దంపతులు బుధవారం పేదలకు వితరణ చూపారు. సంక్రాంతి రోజులు కావడంతో పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. సుమారు 450 మందికి చీరలు, లుంగీలు, పంచెలు, తువ్వాళ్లను తల్లిదండ్రులు స్వర్గీయ కొర్ల కంగాళి, కళావతి జ్ఞాపకార్థం గాయత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్‌గా కన్నారావు ఆయన సతీమణి, మాజీ ఎంపీపీగా కవిత చేతుల మీదుగా పేదలకు, దివ్యాంగులకు, వృద్ధులకు అన్న, వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే ధ్యేయంగా ట్రస్టు పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో కొంచాడ సురేష్‌కుమార్, మార్పు వెంకటేశం, కొత్ర ఆనందరావు, గుంట చక్రపాణి, జానకీరావు, గ్రామపెద్దలు ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

టెక్కలి రూరల్: స్థానిక చిన్నబజార్‌లోని చేపల మార్కెట్ వద్ద ఆదిఆంధ్రావీధి, కోదండరామ వీధులకు చెందిన కొంతమంది యువకుల మధ్య బుధవారం తలెత్తిన చిన్నపాటి తగాదా కొట్లాటకు దారితీసింది. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. టెక్కలి ఎస్సై-2 రమేష్‌బాబు ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేశారు. ఆదిఆంధ్రావీధికి చెందిన దండాసి లోవరాజుతో పాటు మరో పది మందిపై, కోదండరామవీధికి చెందిన కొమ్ము దిలీప్ కుమార్‌తోపాటు మరో నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై-2 రమేష్‌బాబు తెలిపారు.

అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి

కవిటి: గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, మండలపరిషత్ అభివృద్ధి ప్రణాళికలపై 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సమగ్ర నివేదికల్ని సత్వరమే సిద్ధం చేయాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. కవిటి మండలపరిషత్ కార్యాలయంలో ఈ మేరకు లైజనింగ్‌స్టాఫ్ ఇతర ఉద్యోగులకు ఒక్కరోజు శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రెండు అంశాలకు సంబంధించి రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి ప్రణాళికలపై పారదర్శకంగా ప్రణాళికలను సకాలంలో సిద్ధం చేయాలని.. అందుకు సంబంధించిన విధివిధానాలపై శిక్షణలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఈఓపీఆర్‌అండ్‌ఆర్డీ శివాజీపాణిగ్రాహి వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, ఏపీఎం కె.గోవిందరావు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కమిటీ

ఇచ్ఛాపురం: రైతుల సమస్యల పరిష్కారానికి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు రైతుకులం నియోజకవర్గ కన్వీనర్ జన్నెల ప్రసాద్ అన్నారు. బెల్లుపడ రోడ్డులోని జామిఎల్లమ్మ ఆలయం ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతుబంధు కమిటీ విధివిధానాలు వివరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్ర, శివాజీ, సీహెచ్ లోహిదాస్, పి.కోటేశ్వర రెడ్డి, పి.దానయ్య, డి.శ్వనాథం, ఎస్.చత్రపతి, పితాంబర్, వల్లభరావు, నరహరి, కామేష్‌రెడ్డి, కూర్మారావు గోపాల్ పాల్గొన్నారు.

సత్తారు కుటుంబ సభ్యులను కలిసిన తిలక్, దువ్వాడ



వెంకటరమణ, కిరణ్‌లతో మాట్లాడుతున్న తిలక్, శ్రీనివాస్

టెక్కలి: టెక్కలికి చెందిన దివంగత మాజీ ఎమ్మెల్యే సత్తారు లోకనాథం కుటుంబ సభ్యులు వెంకటరమణ, తమ్మన్నగారి కిరణ్‌లను వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ శ్రీనివాస్ బుధవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. తిలక్, శ్రీనివాస్‌లను ఇన్‌చార్జిలుగా ప్రకటించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను మర్యాద పూర్వకంగా కలిసి, పార్టీ విజయంపై వ్యూహాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. వీరితో పాటు నాయకులు దువ్వాడ శ్రీధర్, ఎన్.శ్రీరామ్మూర్తి, బి.తులసీరావు, పి.వైకుంఠరావు, పి.రమణబాబు, బి.గురివినాయుడు, ఎస్.బాలకృష్ణ, ఎస్.సుధాకర్, డి.కుశుడు, ఎస్.మోహన్, చిన్ని జోగారావు, కె.నారాయణమూర్తి ఉన్నారు.

ఐకమత్యంగా వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



దేవుపురంలో మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: అందరూ ఐకమత్యంగా పనిచేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. బుధవారం మండలంలోని పీఏసీఎస్ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు కింతల ధర్మారావు, యర్ర చక్రవర్తిలను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. టెక్కలి అసెంబ్లీ, శ్రీకాకుళం ఎంపీ స్థానాలు వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి వచ్చేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించి ఎన్నికల్లో పోటీ చేసేలా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జద్యాడ జయరాం, అంబోడి విష్ణు, కణితి నారాయణమూర్తి, పోలాకి మోహనరావు, కణితి కృష్ణమూర్తి ఉన్నారు.

అభివృద్ధి పనుల ప్రణాళికలు సిద్ధం

- ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా



మాట్లాడుతున్న రాఘవేంద్ర మీనా

కోటబొమ్మాళి: గ్రామాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించి సమీక్షించారు. పారిశుధ్యం, ఇంటిపన్ను, భూసర్వే పై వివరాలు సేకరించారు. జెడ్పీటీసీ సభ్యయుడ దుబ్బ వెంకటరమణారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, ఈఓపీఆర్‌డీ బి.రామారావు, సూపరిటెండెంట్ ఎస్.రాజేశ్వరమ్మ, కార్యదర్శులు ఎస్.ఎస్.చైతన్య, బి.నరేష్, పి.నిర్మల, ఆర్.నరేష్ ఉన్నారు.

ఆసరా సంబరాలు ఆరంభం



మదేవానిపేటలో ర్యాలీ చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న బృహత్తర పథకం ఆసరా. త్వరలో నాలుగో విడత నిధులు మహిళల ఖాతాల్లో జమకానున్న నేపథ్యంలో బుధవారం నుంచి ఊరూరా సంబరాలు ప్రారంభమైయ్యాయి. వెలుగు సీసీ ఇప్పిలి ధనలక్ష్మి ఆధ్వర్యంలో వజ్రపుకొత్తూరు నుంచి దేవునల్తాడ వరకు ప్రతీ పంచాయతీలో సంబరాలు నిర్వహించి ర్యాలీలు చేపట్టారు. ఈ నెల 22వ తేదీ వరకు ఆసరా సంబరాలు నిర్వహించి అనంతరం పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో రుణ మాఫీ సొమ్మును జమ చేస్తామని ఆమె తెలిపారు. ప్రతీ ఇంటికీ వెళ్లి మూడు విడతలుగా జరిగిన రుణ మాఫీని బొట్టు పెట్టి వివరించారు. మండల వ్యాప్తంగా 1638 స్వయంశక్తి సంఘాల్లోని మహిళలకు రూ.1281.32 కోట్లు రుణం మాఫీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హుల జాబితాలు సీఎఫ్‌లు పరిశీలించి తప్పులుంటే వెంటనే సరి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్కరి ఖాతాలో సొమ్ములు జమ కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎఫ్‌లు నూకమ్మ, డి.యమున, మమిళ ఉన్నారు.

రెడ్డిక సామాజిక వర్గానికి గుర్తింపు



జెడ్పీటీసీ సభ్యురాలు నారాయణమ్మను సత్కరిస్తున్న లోకేశ్వరరావు తదితరులు

ఇచ్ఛాపురం రూరల్: రెడ్డిక సామాజికవర్గానికి పెద్దపీట వేసి ఉన్నత పదవులు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావురెడ్డి అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మను రెడ్డిక ప్రతినిధులతో కలిసి ఈదుపురంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు రెండు ఎంపీపీ, ఒక జెడ్పీటీసీ, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ ఎంపీపీ పదవులను కట్టబెట్టిన ఘనత సీఎం జగన్‌తోనే సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి పాటుపడతామన్నారు. మండల పార్టీ కన్వీనర్ పాలల్లి రాజశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, సర్పంచ్ నీలాపు సారథిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మాసుపత్రి చక్రవర్తిరెడ్డి, మరడ వలసయ్య, ఇసురు తులసీరామ్, రాంపత్ని చిట్టిబాబు, బిర్లంగి వెంకటరావు ఉన్నారు.

తిలక్‌ను ఎంపీగా గెలిపించుకుందాం

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ మ్మేళనంలో వక్తలు



గురువులను సన్మానిస్తున్న పేరాడ తిలక్, తోటి మిత్రులు

వజ్రపుకొత్తూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించుకుందామని వక్తలు అభిప్రాయ పడ్డారు. బుధవారం మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించిన తిలక్ గోవిందపురం ఉన్నత పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 1988-89లో తిలక్ గోవిందపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. ఈ సందర్భంగా నాటి మిత్రులు అంతా సమ్మేళనమైయ్యారు. వారంతా పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా తోటి మిత్రుడిని ఎంపీగా గెలిపించే బాధ్యత తీసుకుందామని ప్రకటించారు. బీసీ కాళింగ సామాజికవర్గానికి చెందిన తిలక్ వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూర్వ గురువులన దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కె.పాపారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గొరకల రామారావు, కె.దివాకర్, దువ్వాడ విజయ్‌కుమార్ ఉన్నారు.

క్రీడా ప్రోత్సాహం అభినందనీయం



బహుమతి ప్రదానోత్సవంలో నాయకులు

సోంపేట: గ్రామాల్లోని యువజన సంఘాలు క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని జింకిభద్ర గ్రామంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల ముగింపు వేడుకలు బుధవారం జరిగాయి. ప్రథమ, ద్వితీయ స్థానాలను కవిటి, తృతీయ స్థానంలో జింకిభద్ర జట్లు నిలిచాయి.విజేతలకు ఎంపీపీ , యువజన సంఘ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కంచిలి విద్యాశాఖాధికారి ఎస్.శివరాం ప్రసాద్, రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీను, జింకిభద్ర ఉపసర్పంచ్ సాహుకారి జానీ, ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పడాల నరేష్, గోవింద్, అనంత్, యువజన సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- ఇచ్ఛాపురం సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని ఇచ్ఛాపురం సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు చెప్పారు. సీఐగా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇచ్ఛాపురం పట్టణ ఎస్సైగా విధులు నిర్వహించిన అనుభవం ఉండడంతో స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందన్నారు. సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కావడంతో నిషేధిత పదార్థాలు అక్రమంగా రవాణా జరగకుండా ఉండేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించగలమన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు మైనర్, లైసెన్స్ రహిత డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టిసారిస్తామని చెప్పారు. సమావేశంలో ఎస్సైలు కె.గోవిందరావు, కె.రాము ఉన్నారు.